**Andhra Jyothi**

## రూల్-7 ప్రకారమే

# 1999 గ్రూప్-2 సెలక్షన్

- ఏ ఒక్కరి ఉద్యోగం పోకుండా చర్యలు
- సూపర్‌న్యూమరరీ పోస్టుల సృష్టిపై దృష్టి
- సుప్రీం తీర్పునకు లోబడి మహిళా రిజర్వేషన్
- సర్కారు నిర్ణయం మేరకు ముందడుగు
- న్యాయ వివాదాలు రాకుండా ఏపీపీఎస్సీ జాగ్రత్తలు

హైదరాబాద్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): గ్రూప్-2 సర్వీసెస్ 1999 నాటి తుది సెలెక్షన్స్‌కు సంబంధించి నెలకొన్న అస్పష్టతను తొలగించే దిశగా ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) చర్యలు ప్రారంభించింది. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం దాదాపు 1200 ఎగ్జిక్యూటివ్ పోస్టుల భర్తీకి ఎన్నడూ లేని విధంగా రూల్-7ను అనుసరించాలని భావిస్తోంది. అంటే అభ్యర్థుల అంగీకారం కోరనుంది. ఉద్యోగం అవసరం లేని వారు అంగీకారం తెలుపరు కాబట్టి, తదుపరి స్థానంలో ఉన్న అభ్యర్థులు ముందుకు వెళ్లే అవకాశం ఉంటుంది. అయితే, ఈ నియామకాలపై ఏర్పడిన సంక్లిష్టతను ప్రభుత్వానికి ప్రతిపాదించి సానుకూల ఉత్తర్వులను పొందాకే ముందుకెళ్లాలని నిర్ణయించినట్లు సమాచారం. సుప్రీం తీర్పును అమలు చేస్తే ప్రస్తుత ఉద్యోగుల్లో కొందరి కొలువులు ఊడిపోవడం ఖాయంగా కనిపిస్తున్నందున, అందుకు ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టి సారించింది. దాదాపు 11ఏళ్ల పాటు ఉద్యోగం చేసిన వారికి అన్యాయం జరగకూడదని, ఏ ఒక్కరి ఉద్యోగం పోకుండా చర్యలు తీసుకోవాలనుకుంటోంది. సూపర్ న్యూమరరీ పోస్టులను సృష్టించయినా.. వారి ఉద్యోగాలకు భరోసా కల్పిస్తూ తదుపరి అడుగులు వేయాలని యోచిస్తోంది. గతంలో అనుసరించిన 70:30 విధానం వల్ల జరిగిన తప్పులను సరిదిద్దాలని భావిస్తోంది. సుప్రీంకోర్టు తీర్పునకు అనుగుణంగా ఇప్పుడు సెలక్షన్స్‌లో 85:15 విధానాన్ని అనుసరించేందుకు రంగం సిద్ధం చేస్తోంది. ఇప్పుడు తీసుకునే చర్యల కారణంగా దాదాపు సెలక్షన్స్ జాబితా స్వరూపం అంతా మారిపోయే అవకాశం ఉందని ఏపీపీఎస్సీ వర్గాలు చెబుతున్నాయి. ఇప్పుడు ఉద్యోగం చేస్తున్న వారి పరిస్థితి మారిపోతుంది. మరి కొందరు కొత్త అభ్యర్థులకూ ఇంటర్వ్యూకు అర్హత లభిస్తుంది. అంటే ఎగ్జిక్యూటివ్ పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహించడం అనివార్యమవుతుంది. ఇక గ్రూప్-2 సెలక్షన్‌లో మహిళా రిజర్వేషన్ విషయంలోనూ అభ్యర్థులకు సందేహాలు ఉన్నాయి. వాటిని నివృత్తి చేసేందుకు కమిషన్ నిర్ణయం తీసుకుంది. ఇందుకు సంబంధించి తాజాగా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును అమలుచేసి సమస్యను అధిగమించవచ్చని భావిస్తోంది. 1999 నోటిఫికేషన్‌కు సంబంధించి ఇప్పటికే గ్రూప్-2 సర్వీసెస్ ఉద్యోగాలు చేస్తున్న వారితో పాటు ఆయా కొలువులను ఆశిస్తున్న అభ్యర్థుల అభిప్రాయాలను తెలుసుకుంటున్న ఏపీపీఎస్సీ.. న్యాయ వివాదాలకు తావులేకుండా తుది సెలక్షన్‌ను పూర్తిచేయాలని సంకల్పించింది. 1999 గ్రూప్-2 సెలక్షన్ నేపథ్యాన్ని పరిశీలిస్తే.. అప్పట్లో ఎంపికైన పలువురు వివిధ కారణాలతో అంటే.. సివిల్స్ గ్రూప్-1, ఇంజనీరింగ్ తదితర ఉద్యోగాల్లో చేరిపోయినందున, వారు ఇప్పుడు గ్రూప్-2 సెలక్షన్స్‌కు వచ్చే అవకాశం లేదు. అలాగే 2000వ సంవత్సరంలో జరిగిన నాన్-ఎగ్జిక్యూటివ్ పోస్టులకు సెలక్ట్ అయిన 33 మంది ఏఎస్‌వోలు తమ అయిష్టతను తెలియజేయడంతో ఇప్పుడు వారిని సెలక్షన్స్‌కు పరిగణనలోనికి తీసుకోరాదని ఏపీపీఎస్సీ భావిస్తోంది.